కథానిక

# దూరపు కొండలు

సత్యమూర్తి

"పాడు నిద్ర- ఇదెక్కడి నిద్ర రామచంద్రా! నోట్లో మెతుకులు నోట్లో ఉండగానే. మాటా మంతా ఏముంది? ఒక్కగానొక్క కుర్రాడు గదా! ఏదో నక్క కూతా కుక్క కూతా కూసి వాడు పక్కమీదకు వెడతాడు. ఇలావుంది సంసారం. కొంపకు ఏమౌతుందో బోధపడదు. ఆడదాన్ని ఎంతకని ఎన్ని కళ్ళు పెట్టుకొని చూచుకోను? ఇది మంచి, ఇది చెడ్డ; ఇదిలా చెయ్యాలి అదలా చెయ్యాలి; అని నేర్పుతో చెప్పుకోడమా? ఏముంది. అత్తగారు చూస్తే ఆ తీరైంది. మరదిగారు రాజభోగం అనుభవిస్తూ పట్నవాస జీవితం చేస్తూ ఉన్నాడు. ఎటొచ్చీ నాకొచ్చింది కర్మ. ఎన్నాళ్ళుపడాలో అన్నాళ్ళూ పడాలి. కొరగాని కొయ్యను కట్టుకున్నప్పుడు సుఖపడదామని ప్రయత్నిస్తే మాత్రం ఏం లాభం? ఏదో భగవంతుడు మామూలు మనిషే అనుకొని నా కడుపునొక కాయ పడేశాడు. వాడి తప్పేముంది? ఇచ్చినవాడు మరిచిపోయాడు. కడుపు నిండా గంజిపోసి వాడి యిష్టం వచ్చినట్లు తిరగమనడంతోటే మన పని అయిపోయిందనుకుంటున్నాడు గాబోలు? ఏమో నాయనా యిదేమి చోద్యమోగాని! మాకూ అన్నదమ్ములున్నారు. మా నాన్నా, అమ్మా వాళ్ళను ఎంత జాగ్రత్తగా ఆలనా పాలనా చేస్తే యింతవాళ్ళు కాగలిగారు? పోనీ, అంతే. ఎందుకూ పనికిరాకుండా తల్లిపేరు, తండ్రిపేరు నిలబెట్టడానికి కూడా పనికిరాకుండా పాడౌతాడు. ఆడదాన్ని ...ఎన్ని కళ్లు పెట్టి గాలించను? ఇంట్లో నాలుగు గోడల మధ్య నా జాగ్రత్త పనికొస్తుంది గాని బయటికి బోయిన తర్వాత ఎవరెలా చేస్తున్నారో నాకేం తెలుస్తుంది? మాటమాటకు "కుర్రాడు ముందుగతి తల్లి ఉగ్గుపాలతోటే ఒక నిర్ణయానికి వచ్చేస్తుంది. తర్వాత ఎన్ని జేసినా ప్రయోజనం ఏమిటి?" అనడం మాత్రం నేర్చారు. నాకెందుకు కందకులేని... ..."

"అంతటితో చాలించు. కష్టపడి వచ్చిన వాడికి కాస్త కాళ్ళమీద చెయ్యి వేద్దామనే బుద్ధి లేదుగాని ఊరికే కాటికాడ నక్కలా పీక్కుతినడం మాత్రం చేతైంది. పల్లెటూరిలో జమీందారు దగ్గిర గుమాస్తాగిరి నిగ్రహించుకోవడం అంటే తేలిగ్గా కనబడుతుందనుకుంటాను నీకు. "సద్దికూడు తిన్న అమ్మ మగడి ఆకలి మరచి పోయిందట" అలా వుంది నీధోరణి."

"ఇంట్లో ఆడది ఎన్ని కష్టాలు పడితే మాత్రం ఎవరు చూడొచ్చారు? పాపం ఏదో మగాడై పుట్టారు గనక సంసారభారమంతా భుజాలమీద మోసుకొస్తున్నట్లు చెప్పుకొంటున్నారు. అది చెల్లనూ చెల్లుతుంది. ఇక మా కష్టాలు వినేవారూ లేరు."

"చిన్నతనంలో నాన్న పోయినప్పటినుంచి యీ సంసారాన్ని ఎలా చేసుకొచ్చానో, ఆడపిల్లలకు పెండ్లిళ్లుచేసి, తమ్ముణ్ణి చదివించి పెళ్ళిచేసి ఇవన్నీ అబాసులేకుండా, ఒకరిచేత పేరు పెట్టి చూపించుకోనవసరం లేకుండా యింత మట్టుకు చేసుకొచ్చేను. ఇవాళ నీ వొకదానవు లేదంటే పోతుందా? మంచి చెడ్డలు యిరుగుపొరుగులవారెరుగుదురు. భగవంతుడికి తెలుసును."

"మాయ సంచంతా నెత్తిన బెట్టుకొని మోసిన్నాళ్ళూ మోశారు. కాదనడంలేదు. తీరా మన కడుపు పండే రోజుల్లో పిల్లల ఆలనా పాలనా చూడ్డానికి మనకు తీరడంలేదు. ఏదీ ఆవాళ మీచేతిలో పెరిగి పెద్దవాళ్ళయిన వాళ్ళనెవరైనా కన్నెత్తయినా చూస్తున్నారా? పైగా ఏదో తండ్రి సంపాదించిన స్థిరాస్తి మీద ఆదాయం తినేస్తున్నామని గోల ఒకటి మన బ్రతుక్కు. ఒక్క నిమిషం సుఖమెలా వుంటుందో ఎరగం గదా!"

"బాగుందేవ్ నీ ధోరణి తో బుట్టువుల మంచి చెడ్డలు . సి పెండ్లీ పేరంటం చెయ్యకపోతే లోకులేమనుకుంటారు? "వాడి కడుపాకలి చల్లారింది కదా" అని అన్నంలో గంజి బోశాడని ఎత్తి పొడవరూ? ఏదో మన కాళ్ళూ చేతులూ చల్లగావుంటే ఒకరోజు కాకరోజు కూడ బెట్టుకోలేక పోతామా? రోజులన్నీ ఒకలాగే ఉండిపోతాయా? ఏదో కాస్త ఓర్చుకోవాలి మరి. దుడుకు పడినంతలో పనులు సాగిపోతాయా? పైగా వచ్చేదేంలేకపోయినా బుద్ధి బయలుపడిపోతుంది. ప్రయోజనం ఏమిటి?"

"ఎప్పుడూ ఒక టేగోల. కాలంకూడిరావాలి. కాలం కూడిరావాలి" అని లేనిపోయినవన్నీ ఒకటి దించితే ఒకటి నెత్తిన బెట్టుకొని మోయడానికి సిద్ధంగావుంటే కాలం కూడిరావడం ఉత్తది. "కష్టపడేవాడికి కష్టం, సుఖపడేవాడికి సుఖం" అని ఏది కోరుకుంటే అదే యెదురౌతుంది బ్రతిక్కి..."

"అబ్బా! నీకింకా యీ పిచ్చి వదిలింది కాదు. తండ్రి సంపాదించిన ఆస్థి, కొంపా, గోదూళని పెట్టుకుండడం; పట్నవాసంలో ఏవో నాల్గు డబ్బులు సంపాదించుకొని ఆ పూట కాపూట రోజులు వెళ్ళబుచ్చుకోవడం సమానమే? తమ్ముడక్కడనుభవించే సుఖమేమిటి? ఇక్కడ మనకు లేకపోయిందేమిటి? యెవళ్ళ కష్టాలు వాళ్ళకుండనే ఉంటాయి. వాళ్ళు మనకు సుఖపడుతున్నట్లు కనబడతారు. వాళ్లకు మనమూ అంతే! దూరపు కొండలు నునుపు గదూ!"

"నా కళ్ళకు గంతలు కట్టండి. మాదంత పెద్దపట్నం కాకపోయినా పట్నమే కదా. అక్కడ ఆ సినీమాలు, ఆ బజారులు, అందమైన రోడ్డు...ఆ ఆనందం మీరెన్ని చెప్పినా యిక్కడకు రావండి. ఇక్కడ శుభ్రమైన బట్ట కట్టుకోడం కూడా తప్పే. నున్నగా తల దువ్వుకోగూడదు.జడనిండా పువ్వులు పెట్టుకోగూడదు. ఇంతెందుకు మొన్న మీతో చెప్పేను కదూ ఏమంత ముస్తాబయిపోయాననీ? ఆ వెంకమ్మ గారు "ఇదెక్కడి అపురూపమమ్మా! భోగం దానివైనా కాకపోయావు" అంది మొఖంమీద. ఒంటిశుభ్రం, గుడ్డశుభ్రం యీ పల్లెటూళ్ళో పనికిరాదు. ఏదో గడ్డి కడుపునిండా మెక్కి కచ్చా ఎగగట్టుకొని కూర్చుంటే మహాసాధ్వి. కాస్త ఏమాత్రం శుభ్రంకోసం ప్రాకులాడినా "టెంపరు, పట్నవాసప్పిల్ల" ఇంకా ఇలాంటి వెన్నో పేర్లుబెట్టి బహిరంగంగా, మొహం మీద పశువుల్లా అరుస్తారు. ఏమో ఏంజేస్తావో భగవంతుడా యీ పల్లెటూరి బ్రతుకు బ్రతకలేకుండా ఉన్నాను."

"ఇంత ఉడుకుబోతుతనం వుంటే ఎలా జెప్పూ! ఈ పల్లెటూళ్ళలో పట్నవాసం మాదిరిగా మనిషి వెనకాల దొంగతనంగా చెప్పుకోరు. గ్రామంలో ఏమనిషి పాడైనా, బాగుపడినా గ్రామస్థులంతా తమదిగా భావిస్తారు. లేకపోతే. వాళ్ళకేంపట్టింది చెప్పూ మొన్న మా చెల్లాయి పెండ్లికి ఊరంతా చుట్టబెట్టుకొని వచ్చి పనిపాటలు జేశారే- చూడ లేదూ? ఇలాంటి సహకారం మీ పట్నంలో ఎక్కడైనా ఎప్పుడైనా చూడలేదు సరిగదా చెప్పుకొంటే విననైనా విన్నావా? పల్లెటూరికొచ్చిన ఒక్క లోటేమిటంటే రిజష్టర్డు సహకార సంస్థలు యిక్కడుండవు. ఒక వ్యక్తి స్వభావంమీద, నడతమీద మరో వ్యక్తికి గట్టి నమ్మకం ఉంటుంది. అంచేత రిజిస్ట్రేషనులు, ప్రకటన బోర్డుల అవసరం పల్లెటూళ్ళలో వుండదు. మాటవరసకు మొన్న చూడు ఆ చెరువుప్రక్క పుంత బాడిపడిపోతే గ్రామస్థులంతా తలో బండి మట్టీ తోలి బాగుచేసుకొన్నారు. ఇలాంటి సంఘటిత కార్యం పట్నంలో మచ్చుకైనా ఒక్కటి కూడా కనపడదు. రోడ్డు ప్రక్కను పిల్లి చస్తే మునిసిపాలిటీకి అప్లికేషను బెట్టి, పాకీవాడిచేత తీయించి పారేస్తారు. ఈలోగా ఎంత వాసన కొట్టినా భరిస్తారు గాని దాన్ని తీసి ఊరి వెలుపల పారేస్తే మంచిదని బోర్డులు కట్టుకున్న సంఘసేవకుల కెవరికీ తోచదు."

"అక్కడ ప్రతివాడూ మర్యాదకోసరం ప్రాకులాడతాడు. ఎంత నీచపుపనైనా చటుక్కున అనుమానించకుండా చేసేపని పల్లెటూరి వాళ్లది. మరి వీళ్ళలా ప్రతిదానికీ గోచీలు బెట్టుకొని తయారుకారు పట్నవాసస్థులు. అదీ వాళ్ల తప్పూ. అయ్యో పరాయి సొమ్ము ఎలా ముట్ట

మని సంశయం కూడా వుండనీ పల్లెటూరి పశువులకు. వెంకమ్మ గోడ పిడకలు సుబ్బమ్మ సుబ్బమ్మ గోడపిడకలు వెంకమ్మ ఒకరిని చూడకుండా ఒకరు విప్పుకోడం; అక్కడ నుండి తొలికోడి కూయడంతో తిట్లు శాపనార్థాలు ప్రారంభించి గొంతుకు బొంగురు పోయి, కాళ్ళూ చేతులూ మూలబడేవరకూ విడిచి పెట్టరు. ఈ దొమ్మరి మేళాన్ని పట్నవాసులతో పోలుస్తున్నారు. ఎవరైనా వింటే నవ్విపోతారు."

"బాగా కనిపెట్టేవు. ఇలాంటి పనులు సంస్కారంలేని పీనుగలు నూటికో కోటికో ఒకళ్లు చేస్తూంటారు. ఇదే దొరికింది గాబోలు నీకు చెప్పడానికి. నాతో పట్నవాసంలో చదువుకున్న పట్నవాసపు అబ్బాయి ఓపర్యాయం యీ వూరు వచ్చేడు. త్రోవలో మామిడి తోటలు, అరటి తోటలు, చెరకు తోటలు చూచి "రాత్రిపూట యెవరైనా వచ్చి పట్టుకపోతేనో" అని వెర్రిగా ప్రశ్నించాడు. వాడికేం తెలుసు పాపం. పట్నవాసంలో మల్లే యిక్కడ కూడా మనిషిని మనిషి మోసం జేస్తూంటారనే తలచాడు. స్వార్థంతో మోసంతో కూడుకున్న పరిసరాలలో మసలిన మనిషి అంతకంటే ఏమి అనగల్గుతాడు? తరువాత పల్లెటూరి పంటల విధానం, ఇక్కడ సంఘజీవనంలో పద్ధతులు చెబితే విని "అలానా" అని విస్తుపోయాడు. పట్నంలో డాబుగా వెళ్ళి వస్తువు ఖరీదు చెయ్యబోతే పావులా. ఆ వస్తువే కొత్త పల్లెటూరి వాలకం మనిషి ఖరీదు చెయ్యబోతే రూపాయి. ఇలాంటివన్నీ పగటిపూట దొంగతనాలు. ఈ దొంగలకు నల్లచొక్కాలు, గునపుల కర్రలూ ఇవేమీ అక్కరలేదు. వంటి శుభ్రం, గుడ్డ శుభ్రాలతోనే గజ దొంగతనాలు పట్టపగలు చెయ్యగల ప్రజ్ఞ, కళ సంపాదించారు పట్నవాసులు."

"పట్నవాసం అక్కడ పరిస్థితులమీద యింతశ్రుత్వం ఉన్నందునే శ్రమపడి పల్లెటూరి జీవనం యెన్నుకున్నారు పాపం. మీ పాటి చదువుకున్న వాళ్లు యెంతమంది సుఖంగా పట్నంలో జీవించడంలేదు? ఇంతెందుకు మీ తమ్ముడు ఏదో క్రిందామీదా పడి ఉద్యోగం సంపాదించుకొన్నాడు. తల్లినికూడా [illegible]కువెళ్ళి చాకిరీ చేయించుకుంటున్నాడు. తల్లిని పోషిస్తున్నాడని ప్రజలు అనుకుంటున్నారు. వాళ్ళ అవసరం తీరుతుంది. పైగా భూములమీద వస్తున్న ఆదాయం మనం తింటున్నామని ఆడపడుచులు, పండగలకూ, పబ్బాలకూ మనమీద పడుతున్నారు. పిండివంటలు, చీరలు జేమారులతోటి అణాగారి పోతోంది సంసారం. చాకిరీ చెయ్యలేక నేను అణగారిపోతున్నాను. పట్టున పదిరోజులు పుట్టింటికి వెళ్ళి ఉండడానికి నాకు తీరదుగదా! ఏంపుట్టుక పుట్టేనో మరి? ఏ అద్దెకొంపైతే మాత్రం పట్నంలో సంవత్సరానికి రెండుసార్లు వెల్ల వేయిస్తారు. హాయిగా యింటి బాధ్యత లేకుండా సంపాదించుకొన్న పది డబ్బులతోటే కాలక్షేపం చెయ్యొచ్చును. పెద్దలు కట్టిన స్వంతకొంపలో ఉండి మనం ఏమి సుఖపడుతున్నాం. రోజూ మరామత్తులే."

"చెప్పేను కదూ వాళ్లు సుఖపడుతున్నారని మనం, మనం సుఖపడుతున్నామని వాళ్లూ భావిస్తూ వుంటారని? మా అమ్మ యిక్కడ లేనందుకు నీకు అత్తపోరు తప్పింది. సుఖంగా యజమానురాల ననుకోడానికి వీలౌతుంది. ప్రక్కింటి సుబ్బమ్మ చూశావూ కోడళ్ళను యెలా చూస్తూందో! పట్నవాసంలో నాలుగు జీతం రాళ్లు వస్తేమాత్రం? ఇంటి అద్దెలకూ, బజారు కర్చులకు, బియ్యం కొనుక్కోందుకు ఒకటేమిటి అన్నీ ఖర్చులే. ఏదో పెద్దలు కట్టిన యిల్లు వుంది కనుక అద్దెకొంప గోడు మనకు తప్పిపోయింది. ఏదో కొత్త ధాన్యం తిండికి సరిపడా ప్రతి సంవత్సరం మనకు భూముల నుంచి వస్తూనే ఉంది. పైకర్చు డబ్బులకు నా జీతం ఉండనే ఉంది. ఇక పండగలకు ఆడపిల్లలను తీసుకొచ్చి తలలో గుడ్డాపెట్టి ఆ కీర్తి గౌరవాలు మనమే దక్కించుకొంటున్నాము. మనల్ని తోసిరాజని మా తమ్ముడు అనుభవించే సుఖం ఏమిటి? మాట వరసకంటున్నాను. తమ్ముడు భూమి, యిల్లు వాటాలువేసి వాడివాటా వాడు పంచుకొని అమ్ముకపోతే మనం కాదనగలమా? కాదంటే చెల్లుతుందా?

ఏదో చిన్నప్పటినుండీ పెంచి పెద్దజేశానని అభిమానం ఉండబట్టే యింతవరకూ ఆస్తుల జోలికి రాలేదనుకో. వాడి పెళ్లాం అత్తవారు, ఆస్తి పాస్తుల గురించి వాణ్ణెంత పీక్కుతింటున్నారో వాడెంత ఓర్చుకొని మంచిగా సర్ది చెప్తూతున్నాడో ఎవరికి తెలుసు? వెనకటికి మా యింటిప్రక్కను ఓ గ్రుడ్డితాత ఉండేవాడు. ఇంట్లో పిండివంటలు జేసుకొన్నపుడు ఆ తాతకు తక్కువబెడితే గుడ్డివాణ్ణి, మూలాన్ని నాకు తక్కువ బెట్టేరు అనేవాడు. పోనీ గుడ్డివాడు వాడికిమాత్రం యెవరు బెడతారని కొస్త ఎక్కువపెడితే నాకే యింత బెట్టారు వాళ్లెంత తిన్నారో అనేవాడు. అలా వుంది నీ విషయం చూస్తేను."

"హేవ్" (ఆవులింతలు)

"నిద్రొస్తోంది కాబోలు పడుకో."

—:O:—

# రాజభాష

"ఆరుద్ర"

ఈ ఏడాది "గాంధీ జయంతి"కి సర్కారువారు బాపూజీ ఫొటోలున్న పోస్టు కార్డులు విడుదల చేశారు. వాటిమీద వివరాలన్నీ వారు రాజభాష అయిన హిందీలోనే ముద్రించారు. ఆనాడు నేను నా స్నేహితులందరికీ "అభినందనాలు" పంపడానికి ఆ కార్డులనే కొన్నాను. సర్కారువారు ఇంగ్లీషు భాషకి బదులుగా దేశభాషని కార్డుమీద అచ్చు వేసినందుకు ముచ్చటపడి నేను కూడా యథాశక్తి రాజభాషని గౌరవిద్దామని ఒక స్నేహితుడి చిరునామా నాగరిలిపిలో వ్రాసేను. రెండవ తారీఖున పోస్టుచేసిన ఆ కార్డు పదమూడవ తారీఖున విజయవాడలో బట్వాడా చేయబడింది. ఈ లోపున సదరు కార్డు "చచ్చిన ఉత్తరాల ఆఫీసు"కి వెళ్ళి గడచిపోయిన ప్రభువుల భాషలో చిరునామా తర్జుమా చేయించుకొనబడి పదిరోజుల పైచిలుకు ఆలస్యంతో సురక్షితంగా నా స్నేహితుడి దగ్గరకు ప్రయాణం చేసింది. ఆనాడే తెలుగులో, ఇంగ్లీషులో చిరునామాలు వ్రాసి పోస్టుచేసిన తక్కిన కార్డులు మర్యాదగా ఒకటి రెండురోజుల గడువులో నా యితర స్నేహితులకి అందేయి. ఇందలినీతి అందరికీ తెలిసినదేగాని ఘనత వహించిన సర్కారు వారికి హెచ్చరిక చేయటానికిగాను మీ పత్రికలో మరికొన్ని "స్టిక్కు"ల జాగా యివ్వగోరుతున్నా.

జనాభాలో సగానికిపైగా ఉన్న ప్రజానీకం రాజభాషలో పుట్టి పెరిగినవాళ్ళు కాకపోయినా, దేశస్థులందరూ ఏకగ్రీవంగానూ, ఒక్క చేత్తోనూ, రాజభాషనే సంభాషణలకూ, ఉత్తర ప్రత్యుత్తరాలకూ ఉపయోగించాలని ప్రభువుల అభిమతం. అందుకుగాను వారు-ప్రజలను ఎన్నో విధాల పురిగొల్పుతున్నారు. నాబోటి పరమ విధేయుడు వారి సత్యాన్ని గ్రహించి-సదరు సర్కారు ఆదేశాలను ఆచరణలో పెట్టినందువల్ల-కొద్దిపాటి, ప్రమాదంలేని ఇబ్బందులకు లోనవడం కద్దు. స్వాతంత్ర్యం కోసం త్యాగాలుచేసిన మహనీయుల వరసలో దేశీయులనందరిని నిలబెట్టడం నిమిత్తం ప్రభువులు ఇటువంటి చిరుత్యాగాలను నావంటివారిచేత చేయించి, కించిత్తు ఘనత సాకూ అంటగడితే అదృష్టవంతుడనేకానీ. నా ఉత్తరాలు నా స్నేహితులకు సకాలంలో అందడం అనేది నా అభిమతం. కాబట్టి రాచరికంవారు దక్షిణ భారతంమీద రాజభాషని రుద్ద దలచుకొంటే దయచేసి ప్రజల ప్రాథమిక సౌకర్యాలని గుర్తించుకొనడం ముఖ్యమని ఈ విధేయుడు తన ఈతిబాధ ద్వారా తెలివిడి చేస్తున్నాడు. ఇది సర్కారువారి దివ్య చిత్తమునకు తేగల ప్రార్థన. ఇంతే సంగతులు.

త్యాగరాయనగర్,

క్రీ. ౧౬-౧౦. ౫౧